
# పరస్పరం

చందు సుబ్బారావు



"ఏవమ్మోవ్–పెద్దమేడోరని ఊరుకుంటుంటే పెద్ద మాటలు మాట్టాడతన్నావే... జాగరత్తగా వదులు మాటలు...కూటికి పేదోళ్ళంకాని గొణానికి పేదోళ్ళం కాదు..." నూకాలు! పాకలో నుంచి బయటకు వచ్చి అన్న పూటలు.

"ఆ తెలుస్తూనే వుంది. మీ గుణాలు...చూస్తున్నాం కదూ...ఏళ్ళ తరబడీ" మేడింటి కమలమ్మగారు...!

## ఊర్ధ్వముఖంగా సెన్సెక్స్



మార్కెటింగ్ మార్కెటింగ్ మనిషి లోకం
స్వప్నసౌధాలు, బ్రతుకు ద్వారాలు మార్కెటింగ్
ప్రతీది మార్కెటింగ్ మార్కెటింగ్
త్రాగేనీరు, వీచే గాలి, నిద్రా సుఖాలు
విద్య అవిద్యలు, నడకలు నాట్యాలు మందులు మాకులు
ఆటలు పాటల మాటలు, పరిశోధనా రహస్య పత్రాలు చిత్రాలు
ఆత్మల ఘోషలు, ఆశయాల మనుషులు మార్కెటింగ్
నీ నా చుట్టూరా కనిపించే ఆకుల అరణ్యాలు అలాలు
చెట్లు, గట్లు, గుట్టలు, పుట్టలు పులుగులు ఊపిరి సాహసాలు
పంచ భూతాలు, పంచ లోహాలు బంధానుబంధాలు
చూసేదేమీ లేదు వెనుకా ముందు అనేదేమీ లేదు వారు వీరు
అక్కర్లేదు నీవు నేను. సంబంధం లేదు నీకు నాకేమి
అంతటా ఎగుమతులు ఎగుమతలై విస్తరించినయ్ విస్తరిస్తూనే వున్నయ్
దిగుమతులు దిగుమతులు వేల లక్షల కోట్ల టన్నులు టన్నులు
తలుపులు, మార్గాలు విశాలంగా తెరచుకొన్నయ్!
బార్లాగా తెరుచుకుంటూనే వున్నాయ్
స్వేచ్ఛా విపణి వీథి సంస్థలు వ్యవస్థలు వ్యవహారాలు
గలగల, కరెన్సీ నోట్ల కట్టల రెపరెపల చప్పళ్ళు
అవి ఇక ముందు డాలర్ చెట్లై స్విస్ బ్యాంకు నిధుల పుష్పాలై
విరగకాసే పంట

ఒప్పందాల ఆధిపత్యాలు వడ్డీ పగ్గాల సంతకాల ఉత్సవాలు
ఖండ ఖండాలన్నింటా గోళగోళలాన్నిటా గ్రహాగ్రహాలంతటి
పోటీ విస్తరణ ఆబే తప్ప మరోటి లేదు
మార్కెటింగ్ మార్కెటింగ్ స్వేచ్ఛా మార్కెటింగ్
స్వైరవిహారం, వీర విహారం సామ్రాజ్య దాహం
లక్షల హస్తాల, కోట్ల కోరల, బీభత్స నృత్య దేహాల
మార్కెటింగ్ రంగస్థలం ధరణి రంగస్థలం

– సుచిత్ర

"ఏటి తెలిసింది నీకు. ఊరకే సాగతీస్తన్నవు. గొడ్డు తినకపోతె నువ్వు తింటావా మొక్క...గేణం లేని జంతువ తింటె ఏం చెయ్యాల...పొన్నేనుండి సూత్త వూరుకుంటే...తప్పట్టాల..." నూకాలు చేతులూపుతూ!

"ఆ...ఏం' చెయ్యాల...నరికి పోగులేసుకోవాల...సంతలో అమ్మేసుకోవాల. ఊరిళ్ళమీద వదిలితే ఊరుకుంటారా...తాముండకంతలేదు...మెడకో డోలని గేదె ళొకటీ...పూల మొక్కలన్నీ మేసి పాలిస్తే అమ్ముకుని సొమ్ములు చేసుకోండి...బాగా" కోపం హెచ్చింది కమలమ్మగార్కి.

"అమ్మో...అమ్మో...పాడిగేదెను నరికేసుకోవాలట. నీ నోరువడ...నీ జిమ్మడ...నీ నట్టింటో నాగుపాము కదల...లచ్చి మాతల్లిలాంటి గేదెను ముక్కలు చేసుకోవాలంట...ఓలమ్మో...ఎంత పాపపు మాటంటివి ఓలమ్మో... దీనింట్లో అమ్మోరుపుట్ట...దీని మొగుడికి నుప్పెట్ట..." నూకాలు!

"ఛా–నోరుముయ్...ఏందామాటలు. పెద్దా చిన్నా లేదు...తప్పు మనమీదున్నాది...ఎల్లవతలకి. ఎల్లంఢమ్మగోరూ...మాదే తప్పు...నా వస్తువ నీయింట్లో పరవేశించి ఆగడం చేసిందీ అంటే...దోసం నాదే...మరి దాని మాటలు పట్టించుకోకండి..." అప్పలస్వామి ఒప్పేసుకున్నాడు...! నూకాలును నెట్టివేశాడు.

"ఇంక చాల్లే లోపలికిరా...వాళ్ళతో మాట మీరకూడదని ఎన్నిసార్లు చెప్పినా వినవు...నాలుగూ అయ్యాయి కదా...ఇంక దయచేయి..." కమలమ్మ భర్త నారాయణమూర్తిగారు.

నూకాలూ, కమలమ్మా శాంతించారు.

అప్పలస్వామి నారాయణమూర్తిగారితో "అయ్యా...నోరులేని జంతువు. మరి జాగరత్తగా వుంటం... అమ్మగారిని అన్నెదా బావించొద్దనండి"

"అలాగే అప్పన్నా...దాందేముందిలే...మనుషులకే బుద్ధి వుండదు. గేదెకుంటుందా"

* * *

ఇది జరిగి నాలుగేళ్ళయింది. ఆనక రెండు కుటుంబాలకూ మాటలు అంతంతమాత్రంగా సాగాయి. అప్పలస్వామి యూనివర్సిటీలో ప్యూను పని చేస్తున్నాడు. తన డిపార్టుమెంటులో రామారావుగారని ప్రొఫెసరు. రామారావుగార్కి ఇల్లుకాక రెండు స్థలాలున్నాయి. ఒకదాంట్లో అప్పన్నను పాక వేసుకు వుండమన్నాడు. వట్టిగావుంటే మున్సిపాలిటీవారు ఎందుకు ఖాళీగా వుంచారని ప్రశ్నలు వేయొచ్చని అలా చేసాడు. ఆ ప్రక్కదే నారాయణమూర్తి మేడ యిల్లు. మూర్తికి పోర్టులో ఆఫీసరుద్యోగం. మనిషి మంచివాడు. మంచీ, చెడూ తెలిసినవాడు. చిన్నా, పెద్దా ఎరిగినవాడు. ఆయన భార్య కమలమ్మ నోరు బహు చెడ్డది. ఊరంతా చెడ్డదేనని ఆమె భావిస్తుంది. నూకాలుకు నల్గురు పిల్లలు. అప్పన్న సంపాదనతో గడవక రెండు గేదెల్ని సాకుతూంది. గడ్డి కొంటారు. నీళ్ళు మునిసిపాలిటీ. కుళాయి నుంచి మోస్తుంది. అటూ యిటూ అన్నీ మిద్దెలూ... మేడలూ...వారికి మునిసిపాలిటీ కుళాయిలు కాక సొంత బోరింగులున్నాయి. స్విచ్చి నొక్కితే పాతాళ జల ధారగా వర్షిస్తోంది. రోజూ కుళాయినుంచి బిందెలు మోసే నూకాలుకు 'సిచ్చి' నొక్కితే జల కురియటం పూర్వజన్మలో పుణ్యం అనిపిస్తుంది. పాకలో కిరసనాయిలు దీపానికీ మేడలో 'సిచ్చి'కీ పోల్చి పోల్చి చూసుకుంటుంది. కడుపు మండినప్పుడు నోటికొచ్చినట్లు తిడుతుంది.

మేడల్లో వాళ్ళు సహజంగా నీళ్ళివ్వరు. గేదెల నూకాలుకు ఓ రోజిస్తే రోజూ యివ్వాల. సంతయిపోతుందని కాలనీవాళ్ళంతా వీలుపడదంటారు. పిల్లల్లో మగాళ్ళిద్దరూ రోడ్డు మీద బలాదూరు తిరుగుతూంటారు. ఆడపిల్లలు అమ్మకు నీళ్ళూ, నిప్పులూ అందిస్తుంటారు. అప్పన్న పొద్దునపోయి రాత్రి భోజనాలవేళకు యిల్లు చేరతాడు.

* * *

విశాఖపట్నం యీ మధ్యన బాగా పెరిగిపోయింది. పాతికేళ్ళు కూడా కన్పించని మువ్వలపాలెం కాలనీలో యిపుడు పాతిక వేల యిళ్ళు లేచాయి. ఖాళీ. స్థలాలే కన్పించటం లేదు. ఉన్న ఒకటి రెండు స్థలాల్లో ఇలా గేదెల్తో వుంటూ పాలమ్ముకునే వాళ్ళే ఎక్కువ. పట్నం పెరిగినకొద్దీ గేదెల వాళ్ళపని గడ్డుగా తయారైంది. చూడబోతే జాగా లేదు. కుళాయిలు రోజు విడిచి రోజుగానీ రావు. అందులోనూ జనానికి తలకు నాలుగు బిందెలకంటే యివ్వరు. తనూ యిద్దరాడపిల్లలూ నుంచుంటేనే పది బిందెలు కనాకష్టం. గేదెలు చూడబోతే ఒక్కోటీ నాలుగు బిందెలు తాగుతాయి. ఇంక పిల్లలకు, అప్పన్నకూ స్నానాలూ...వంటా...అంట్లూ...ఎలా లాగుతుందో ఎవరికీ తెలియదు. నూకాలికి తప్ప...తను పనిచేసే యిళ్ళల్లో ఒక్కో యింటినుంచి రెండు బిందెలు తెస్తుంది. ఈ డైరీ పాల పాకెట్లు తాగలేక పిల్లలకోసం గేదెపాలు పోయించుకునేవాళ్ళ పుణ్యమా అని మరి నాలుగు బిందెలు దొరుకుతాయి. కుళాయి దగ్గర జనం అయిపోయి ఖాళీగా కనపడితే యింకాసిని నీళ్ళు గిడతాయి. మునిసిపాలిటీ బండివాళ్ళు పేదవాళ్ళకు పొయ్యరు. ఒక్కో లారీ మూడు వందల రూపాయలట. ముష్టోళ్ళకోసం కాదీ నీళ్ళు అని డ్రైవరు విదిలిస్తాడు. ఎపుడన్నా పెద్దది ఆళ్ళని మంచి చేసుకుని నాలుగు బిందెలు రహస్యంగా తెస్తుంది. అదైనా తనకైతేనే యిస్తారు. నూకాలు వెళ్ళినా, చిన్నది వెళ్ళినా జాంతానై. దాని ముక్కూ ముహమూ బాగుంటయి కాబోలు. 'నీళ్ళివ్వటానిక్కూడా నీటుగా సావాల్నా...ఏడనుంచొస్తదివ్వదు సోకు...' అనుకుంటుంది నూకాలు.


జోరున వర్షం కురుస్తుంటే నూకాలకు పండగలా వుంటుంది. కాని అదేం చిత్రమో...వర్షం ఆగిపోగానే ఎక్కడ నీళ్ళక్కడ గప్‌చుప్. అల్లా ఆ తొట్లోపడ్డ కాసినే మిగులుతాయి. కుండపోత ఏమవుద్దో, కాలవలేమవుతాయో, ఉరిమే మేఘాలేమవుతాయో, ఊరూవాడా ముంచి లేపినట్లుంది. వాన వెలవగానే హుష్ కాకి...అంతా ఖాయ అనుకుంటుంది నూకాలు.

ప్రక్కింటి మూర్తిగారి దగ్గర కొన్నాళ్ళు నీళ్ళు తెచ్చుకునేది. కమలమ్మ చూసీ చూడనట్టూరుకునేది. ఓ రోజున పనిమనిషి రాలేదు."అంట్లు తోమి పెట్టగలవా నూకాలూ" అంది. "అలాగేనమ్మ "అని తోమిపెట్టింది. బండెడు అంట్లు. ఊరికే వస్తే మూరలేసినట్లుగా యింట్లోవన్నీ తెచ్చిపడేసింది. ఎలాగో తోమింది. మరి పది రోజులకి నీళ్ళ కోసం వెళితే "యివ్వాళ్ళకూడా పనిమనిషి రాలేదమ్మా. తోమిపెట్టవూ" అనడిగింది.

అవతల గేదెలు అఘోరిస్తున్నాయి. పాలవాళ్ళకు ఆలస్యమవుతుంది. పొయ్యి రాజెయ్యలేదు. పొద్దుగూకుతూ వుంది. పిల్లలు ఆవురావురుమంటూ వస్తారు. "వీలుపడదమ్మా...గేదెల దగ్గర కూర్చోవాల" అన్నది.

"అహ్హా వీలు పడదూ...మా నీళ్ళు బాగా వంట పడతాయి కాబోలు.." అంది.

"ఏందమ్మా ఆ మాటలు...వీలుంటే మొన్న తోమలా" నూకాలు.




# చిన్ని చిన్ని ... ... ఆశ

నాన్నా, మీ నాన్నా యింతేనా,
తల్లి పక్కని తడి చేసే వయసులోనే
పక్కలు వేరు చేసేశాడా.
వుట్టిన ఆరు నెల్లకే గారపట్టిన గాజు సీసా మంచి
చిల్లు పెట్టిన రబ్బరు తిత్తిలోంచి, నా చిన్ని బోసినోట్లోకి
పారుతూ వచ్చిన ఆ పిండి నీళ్ళచుక్కలే
అమ్మపాల అమృతధారలని నమ్మబలికాడా
నాన్నా, అమ్మ చూపుల ప్రేమ బంధాన్ని లాగి లాగి, తెగలాగి,
బలవంతంగా తెగేదాకా లాగి, నీ పడగ్గది గడియకి ముడేసి,
నీ ఫార్మాలిటీ నవ్వుల గుడ్‌నైట్‌తో, నన్ను బిక్కు బిక్కుల
ఒంటరి గదిలో... ఒంటిగా... వదిలేస్తావు
నా మనసులోంచి పొంగుకొచ్చే బెంగ. నా కళ్ళల్లోంచి ధారగా కురిసినా
నీ మనసు చెమ్మగిల్లదా నాన్నా
అమ్మ చాటు నుంచి అమాయకంగా చూసే నా యూకేజి కళ్ళల్లో
నీ కప్పుడే అంత ముదురుతనం కన్పించిందా నాన్నా
ఆకలి లేనప్పుడు తిండి, అవసరం లేకపోయినా టాయిలెట్
మార్కులు రాకపోతే వాతలు, అదంతా కలిపి డిసిప్లిన్.
లేగదూడలాంటి నన్ను అమ్మ ఒడి నుంచి అదాటున లాగేసి
ఆ బోర్డింగ్ స్కూల్ కంచెకి కట్టెయ్యడానికి, మనసెలా ఒప్పింది నాన్నా.
ఆ తాడు మా అమ్మ మెడలో వేసినందుకే నీ కంత హక్కయితే,
అమ్మ పేగులు తెంచుకుని వుట్టిన వాడ్ని, నా కెంత హక్కుండాలి.
నా ఫ్యూచర్ సీన్ రంగుల్లో చూపించి అమ్మనోరు నొక్కెయ్యకు.
నీ పెళ్ళాంతోపాటు మా అమ్మగా కూడా వుండనియ్యి.
ఈ రోజు నీదని నా పసిమనసుని క్రూరంగా చిదిమేస్తే,
రేపటి రోజున నీ లోకమంతా ఆ వృద్ధాశ్రమమే సుమా.

– కంభంమెట్టు త్రినాథ్‌రెడ్డి

"మొన్న తోమితే మొన్ననే తోడుకెళ్ళలా నీళ్ళు...మళ్ళీ వచ్చావేం మరి" కమలమ్మ!

"ఏం బుద్ధమ్మా తమది..."

"నా బుద్ధి నచ్చని దానివి...నా నీళ్ళెలా నచ్చుతాయి...అంత అభిమానం కలదానివి నీళ్ళు చెట్లలో పారబోసిపో..." - కమలమ్మ.

పారబోసి వచ్చింది నూకాలు.

ఆ తర్వాత రెండిళ్ళ మధ్యా రాకపోకలు తక్కువయ్యాయి. కమలమ్మ నూకాలు పిల్లల్ని అడపా దడపా 'అసే ముత్యాలూ...కూరగాయలు తెచ్చిపెటు' అనీ, 'అసే మాణిక్యం...తొందరగాపోయి ఓ కిల ఉల్లిగడ్డలు పట్టుకురా' అనీ పురమాయించేది.

మగపిల్లల్ని 'అరే వెంకట్రావ్, కాస్త కొబ్బరికాయలు దించిపెట్టవూ' అనీ, 'అరే సూరబ్బాయి... చెట్టు చివార్న మామిడికాయుంది కోసివ్వు నాయనా' అనీ అడిగేది. ఆదివారంపూటయితే నారాయణమూర్తి అప్పన్నను పిలిచి 'అప్పన్నా, జామిచెట్టు పాదు తవ్వాలోయ్' అనీ

'అప్పన్నా...అప్పన్నా...యింట్లోకి పాము పిల్లొచ్చిందోయ్...తొందరగా రా' అనీ పిలిచి పురమాయించిన రోజులనేకం. అప్పలస్వామి తనంత తానే 'అయ్యా, యిల్లు సున్నం వేయించాలి... మాసిపోయింది...సున్నం తెప్పించండి...ఓ ఆదివారం లాగిస్తాను' అని ఊరికే పనిచేసిన రోజులున్నాయి.

ఓమారు ఉన్నట్లుండి కమలమ్మ కళ్ళుతిరిగి పడిపోతే నూకాలు యింటి పనీ, వంటపనీ కూడా చేసిపెట్టింది. నాలుగు రోజులపాటు రెండిళ్ళకూ తానే దిక్కయింది. ఆ నాల్గు రోజులూ అప్పడప్పుడు నూకాలు గుర్తు చేస్తుంటుంది. కమలమ్మ వెంటనే "నాల్గు రోజులూ నీళ్ళ బిందెలు తరలి వెళ్ళాయిగదే...మోటారు కరెంటు ఖర్చు కట్టు!" అని తిరిగి వడ్డిస్తుంటుంది.

ఇవన్నీ ఒక ఎత్తూ...ఒకసారి అప్పన్న నారాయణమూర్తికి చేసిన సాయం ఒక ఎత్తూ...ఆ విషయమే ఇద్దర్నీ మనుషులుగా బంధించింది. ఇద్దరిలోనూ మానవత్వం ఒకటేనని రుజువు చేసింది. కాని అది రహస్యంగా వుండిపోయింది చిన్న కారణంచేత. అప్పన్న మంచితనం మూర్తి అందుకే మరువలేదు. మనిషి సాయం అందులో చెప్పుకోవటమేమిటి బాబూ...అని అప్పన్న ఎవరికీ చెప్పనూ లేదు.


* * *

నది వేసవి రోజులు. విశాఖపట్నంలో నీళ్ళు మూడ్రోజుల కొకసారికాని రావటం లేదు. సొంత బావులవాళ్ళు లాగిస్తున్నా, కుళాయి వాళ్ళపని ఘోరంగా వుంది. గేదెల వాళ్ళపని మరీ కనాకష్టం అయిపోయింది. "వాటి రక్తం పాలుగా తీసి అమ్ముకోవటం తప్ప కడుపులోనికి కాసిన్ని నీళ్ళు యివ్వలే కపోతున్నాం" అని బాధపడుతున్నారు. గేదెలు మురికి నీళ్ళు త్రాగుతున్నాయి. డొక్కలు మాడుతున్నాయి. అస్థిపంజరాలవుతున్నాయి. మునిసిపాలిటీ కుండీల్లోని కాగితాలు తిని పాలిస్తున్నాయి. ఎండలు చూడబోతే మండిపోతున్నాయి. అభిమానం వదిలి కమలమ్మను నీళ్ళు అడుగుదామా అనుకుంది నూకాలు. కమలమ్మ ఎండలకు మరీ వేడెక్కినట్టు రుసరుసలాడుతూంది. ఎలా అడగాలో తెలియడంలేదు. కుళాయిలు వచ్చినప్పుడు రెండు బిందెలు కూడా దొరకటం లేదు. రోజులు గడవటం లేదు. అనుకోకుండా మూర్తిగారి కుటుంబం ఇంటికి తాళం పెట్టి పెళ్ళికి వెళ్ళింది. నూకాలు గోడ దూకి కుండీలో వున్న నీళ్ళను నాలుగు రోజులు మోసేసింది.

'ఏంటాపని...ఆరులేనప్పుడు గోడ దూకటం తప్పు కాదేటే నూకాలూ' అని అప్పన్న అన్నాడు.

"ఆ తప్పే...ఒప్పు సెయ్యరాదూ నువ్వు...నువ్వూ...నీ కొడుకులు ఏడన్నా నాలుగు బిందెలు తెండి.. .తెలుసుద్ది" అంది నూకాలు.

బిడ్డల్ని కాక, గేదెల ముఖంచూసి అప్పన్న ఊరుకున్నాడు. మరి రెండు రోజులు గడిచాయి. కుళాయిలు వచ్చి నేటికి నాలుగో రోజు. నీళ్ళు దొరకటం లేదు. ఒకటీ అరా ఎవర్నయినా అడిగి తెస్తే యింట్లోనే సరిపోతున్నాయి. నూకాలుకు కాలూ చెయ్యీ ఆడటం లేదు. గేదెలు అల్లాడిపోతున్నాయి.




మూర్తిగారింట్లో కుండీ ఖాళీ అయ్యింది. నీళ్ళు మళ్ళీ రావాలంటే మోటా రెయ్యాలి. స్విచ్చి వెనక గదిలో ఉంటుంది. గదికి లోపల గడివేసి వుంది. నూకాలు పొద్దుననగా పోయింది బిందె తీసుకుని. అన్నం వేళయినా తిరిగి రాలేదు. పిల్లలు నకనకలాడిపోతున్నారు. అప్పన్న ఆఫీసుకు పోయాడు. నూకాలు కొడుకులిద్దరూ ఆకలితో చిందులు త్రొక్కుతున్నారు. ఆడపిల్లలు ముడుచుకున్న గువ్వల్లా కూర్చుండిపోయారు. వంట చెయ్యటానికి నీళ్ళు లేవు.

పొద్దు నడినెత్తికొచ్చాక నూకాలు బిందెడు నీళ్ళతో తిరిగొచ్చింది. పొయ్యి రాజేసి పిల్లలూ తనూ ఎంగిలిపడేసరికి సాయంత్రం మూడయింది. స్పృహ తప్పినట్లు నిద్రకు పడ్డారు. గేదెలు తొట్లో చివరి చుక్కల్నీ, మురికి కాల్వలో నీటి బిందువులన్నీనాకుతున్నాయి.ఉలిక్కిపడి లేచింది నూకాలు!

అమ్మో నా గేదెలు! రాత్రనగా పెట్టాను గుక్కెడు నీళ్ళు...నీళ్ళు...నీళ్ళు... ఏవీ...ఎక్కడున్నాయి... భూమిలో వున్నాయి. భూదేవి కడుపులున్నాయి. పైకెలా వస్తాయి. 'సిచ్చి' ఏస్తే వస్తాయి. 'స్విచ్చి' ఎక్కడుంది...మూర్తిగారివంటింటి ప్రక్కన వసారాలో వుంది. వసారా ఎక్కడుంది...తలుపుల వెనక వుంది. తలుపులు గడివేసున్నాయి. ఎలా...ఎలా...ఎలా...చీకటి పడింది.

నూకాలు మెదడ్లో వెలుతురేకాక స్విచ్చి వేసినట్లు విచ్చుకుంది. మగపిల్లల్ని దగ్గర్నీ పిలిచి చెవిలో ఏదో చెప్పింది. ఆడపిల్లల్ని బయట కాపలా పెట్టింది. పిల్లలూ తనూ గోడ దూకారు. పెద్ద కొడుకు చేతిలో గేదెను కట్టివేసే పలుగు వుంది.

నూకాలు గుండెలు దడదడ లాడాయి.

అటూ యిటూ చూసింది. గేదెల ముహం చూసింది. తన అవస్థ చూసింది. దాహం వేసింది. అభిమానం విడిచింది. పిల్లలకు సైగ చేసింది.

పిల్లలు గది తలుపుల్లోంచి పలుగుపెట్టి చెరో చెయ్యి వేసి ఒక్క గుంజు గుంజారు. 'గడి' ఫెళ్ళుమని విరిగింది. తలుపులు తెరుచుకున్నాయి. లోపలికెళ్ళి గోడమీద మీటరు మధ్యలో వున్న స్విచ్చి నొక్కారు. 'జయ్' మని మోటారు శబ్దం చేసింది. ఎవ్వరైనా వింటారేమోనని నూకాలు గజగజలాడిపోయింది.

మరుక్షణం నీళ్ళు మేడమీదకెక్కి క్రిందికి దూకాయి.

కుండీలోకి ప్రవహించాయి. అమ్మతల్లి...జలతల్లి...పాతాళ గంగమ్మ దేవర... ఈశ్వరుడి నెత్తిమీద తల్లి...ప్రాణాలు నిలిపే తల్లి...మూగ జీవుల గొంతుల్లో అమృతం కదిపే తల్లి.

కుండీ నిండిపోయింది.

స్విచ్చి ఆపి పిల్లలూ నూకాలూ బిందెల్తో నీళ్ళు మోసేసారు.

* * *

ఆ మరురోజు, అంటే అయిదో రోజున కుళాయిలొచ్చాయి. ఆరో రోజు ఉదయం నారాయణమూర్తి కుటుంబం వచ్చింది.

కమలమ్మ కేకలకు ఊరూవాడా దద్దరిల్లింది. "నాయింట్లో దొంగలు పడ్డారు దేవుడో" అని రంకెలు వేసింది.

"అలగా జనం మధ్యన చేరాం దేవుడో...ఎవరో దోచేసారు దేవుడో" అని రాగాలు తీసింది.

"ఏమేం పోయాయమ్మా" అనడిగారు వాళ్ళు.

"ఏవేం పోకేమి తల్లో...పాత చీపురూ, మసిగుడ్డా, గుత్తి కవ్వం, చక్రాల గిద్దలూ, రెండుల్లి గడ్డలూ, అట్లకాడ, మినప్పప్పూ, సబ్బుబిళ్ళా, పేల దువ్వెనా, సీసాలు కడిగే బ్రష్షూ, సుత్తీ, కత్తెర, ఒకటేమిటి దేవుడో" అని అరిచింది. అరుస్తున్నప్పుడు చెప్పకూడదని మూర్తి ఊరుకున్నాడుకాని తనకు సుత్తీ కత్తెరా కనిపిస్తూనే వున్నాయి. చీపురు బాతురూంలోనే వుంది. కవ్వం గుత్తి గేసు స్టవ్ వెనకే వుంది. ఉల్లిగడ్డలు ఎలుకలు తిని ముక్కలు వదిలేసాయి.

అంతా పోలీసు రిపోర్టివ్వమన్నారు. అప్పన్న పెళ్ళామే చేసుంటుంది. పోలీసులు నాలుగు తిడితే అన్నీ బయటకు కక్కుతుంది. వెళ్ళండి స్టేషనుకన్నారు.

'అలాగే' అని మూర్తి రోడ్డుమీదకు వెళ్ళి కాఫీ త్రాగి తిరిగొచ్చి "రిపోర్టిచ్చాను' అని చెప్పాడు. చిన్నా చితకా పోతే పోలీసులు రారట. అక్కణ్ణుంచే దర్యాప్తు చేస్తారని కమలమ్మకు వివరించాడు.

* * *

ఆ రోజు రాత్రి చీకట్లో రోడ్డుమీద అప్పన్న ఎదురుపడి 'అయ్యా' అని మూర్తిని పలకరించాడు.

'ఏం అప్పన్నా' నారాయణమూర్తి!

"చేసిన నేరం చెబితే దోసముండదంటారు. తమరు లేనప్పుడు మాకాలూ పిల్లలూ నీళ్ళ కాసెపడి ఎనక తలుపులు బద్దలు కొట్టారయ్యా...చండాల పని చేసారు. తమరే సిచ్చ విదించినా సరే. వస్తువేదీ ముట్టుకోలేదు. ఇంక తమ దయ. పోలీసులొత్తే నా పేరే సెప్పండి. నాల్రోజులుపోయి కొట్లో కూకుంటాను"

నారాయణమూర్తి నవ్వి "పర్వాలేదులే అప్పన్నా...నేనప్పుడే అనుకున్నాను. ప్రాణాలు నిలుపుకోవటం కోసం కదా చేసారు. కడుపులో పెట్టుకుంటాన్లే...నీ రుణం తీర్చవద్దూ" అన్నాడు.

"రుణమా-తవరా-తవరు నాకు రుణమేంటి బాబూ"

"చేసిన మేలు చేసినట్లు గుర్తుంచుకోవడం చిన్నవాళ్ళ పని. నీది పెద్ద మనసు. వెళ్ళిరా. పోలీసులూ లేరు...ఏవీ లేదు..." అన్నాడు మూర్తి.

'మూర్తిబాబుది గొప్ప మణుసు' అనుకుంటూ అప్పన్న వెళ్ళిపోయాడు.

* * *

మూర్తికి ఆరు సంవత్సరాలనాటి విషయం కళ్ళముందు కదిలింది.

కమలమ్మ పుట్టింటికి వెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేరు. బయట సన్నగా వానజల్లు పడుతూంది. రాత్రి ఏడుగంటలవుతూంది. తన ఇంట్లో పనిమనిషి రాజాలు నీళ్ళకోసం బిందె పట్టుకొచ్చింది. కుండీలో నీళ్ళు లేవు. స్విచ్చి వేద్దామని యింట్లోకొచ్చింది. ఇంట్లో కరెంటు లేదు! 'బాబూ' అంటూ చనువుగా హాలు మధ్యలోకి నడిచింది. 'ఆ' అంటూ మూర్తి గదిలో నుంచి బదులు పలికాడు. అప్పటికే అతనిలో స్వార్థం పడగవిప్పి బుసలు కొడుతూంది. ఎప్పుడూ అలవాటు లేని పనికి పూనుకోవటంచేత తొందరకూడా ఎక్కువయింది. ఎలాగో నోరువిప్పి "రాజాలూ కొవ్వొత్తి టేబిల్‌మీద వుంది. ఇటొచ్చి వెలిగించు" అనగలిగాడు. రాబోయిన రాజాలు మంచం తగిలి మూర్తిమీద పడింది. మూర్తి అదే అదనుగా కౌగలించుకొని మీదకు వంగాడు. రాజాలు విదిలించుకుంటూ అరవసాగింది. కాసేపు గందరగోళమయింది. ఎలాగో బయటకొచ్చి బిందెతో విసురుగా వెళ్ళిపోతున్న రాజాలును వాకిట్లో అరుగుమీద కూర్చున్న అప్పన్న చూశాడు. లోన జరిగిందంతా గమనించాడు.

మూర్తి బయటకొచ్చి అక్కడున్న మనిషిని చూసి 'అప్పన్నా' అంటూ నిశ్చేష్టుడయ్యాడు.

అప్పన్న ఓదార్చాడు...'కలవరపడకండి...తప్పు మానవ సహజం. కడుపులో ఎట్టుకుంటాను' అని అభయమిచ్చాడు. పైగా మర్రోజు రాజాల్తో మాట్లాడి సర్దిచెప్పాడు.

"అయ్యగారు మంచోడు. పొరపాటు సెయ్యటం మడిసి లచ్చణం మరోసారి జరగదని మాటిస్తన్నాడాయన. పెద్ద మణుసుతో చమించు అటు సీ బర్తకూ, ఆయన భార్యకూ తెలిస్తే కొంపల్లో చిచ్చు పడుద్ది. పెద్దోణ్ణి నా మాట కాయి" అన్నాడు అప్పన్న.

## మా అమ్మ శ్రమకు వృద్ధాప్యం రాలేదు



లోకాన్ని నిద్ర లేపే సూర్యుణ్ణే
మా అమ్మే నిద్ర లేపుతుంది
తెలిమంచు వెలుతురులోనే
వాకిట ముందు కళ్ళాపై ముగ్గవుతుంది మా అమ్మ
ఐదింటికే అంట్లు తోమే కొబ్బరి పీచవుతుంది
ఆరింటిలోపే మా పిల్లల
స్నానానికి నీళ్ళవుతుంది సబ్బవుతుంది
యూనిఫారం హేంగరవుతుంది
ఆరున్నరకే అన్నపూర్ణై
మా పిల్లల క్యారేజీల్లో కూర్చుంటుంది
మా ఆవిడ టిఫిన్ బాక్సులోకీ జారబడుతుంది
చీపురవుతోంది; పిడచ గుడ్డవుతుంది
పదింటికే చాకిరేవై
తన చెమటను పిండి
[illegible]నికి మ[illegible]వై వ్రేలాడుతుంది
బొగ్గు కుంపటి ముందు వూదుడు గొట్టమై
పన్నెండుకల్లా మా నోటి దగ్గర పళ్ళెమవుతోంది
కునుకు తీద్దామని చాప పరిచేలోగా
ఇస్త్రీ పెట్టెగా రూపాంతరం చెందుతుంది
అంట్ల గిన్నెల్లో అంట్ల గిన్నయ్యేలోగా
పిల్లలతో పరుగులు తీసే పిల్లల కోడవుతుంది
మళ్ళీ వంటై వార్పై
రాత్రికి మళ్ళీ మా డైనింగ్ టేబులవుతుంది
ఏ రాత్రి పదకొండింటికో
కోడి నిద్రై త్రుళ్ళిపడే స్వప్నమవుతుంది
పనికీ పనికీ మధ్య పరుగులు తీస్తూ
గోడగడియారంలో సెకన్లముల్లవుతుంది మా అమ్మ
పిల్లల ఆగడాల మధ్య మా నిష్ఠూరాల మధ్య
వడలిన మామిడాకవుతుంది మా అమ్మ
మా అమ్మ వయసుకీ శరీరానికే గాని
మా అమ్మ శ్రమకు యింకా వృద్ధాప్యం రాలేదు.

– జుగాష్ విలి

రాజాలు మాట మన్నించింది. ఏమీ తెలియనట్లు ఇంటికొచ్చి పనిచేసుకుంటూంది. మూర్తి వీలున్నప్పుడల్లా రాజాలుకు ఒకటికాదు పది బిందెలు పట్టి తీసుకు పోనిచ్చేవాడు.

తన తప్పను మన్నించిన అప్పన్న కుటుంబానికి నీళ్ళివ్వలేకపోతున్నానే అని చాలాకాలంగా బాధపడుతున్నాడు.

ఇప్పుడిలా భూదేవి కడుపులో నీళ్ళు తన నేరాన్ని కడిగేసినట్లు భావించాడు!